సంపుటి :02 సంచిక :200 పేజీలు :04

వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com


Voice of the people

శుక్రవారం 03, అక్టోబర్ 2025

# అభ్యర్థుల వేటలో పార్టీలు.

03

- ❖ భూపాలపల్లి జిల్లాలో జెడ్పీటీసీ అభ్యర్థుల వడబోత షురూ
- ❖ ఒక్కో మండలం నుంచి ముగ్గురి పేర్ల పరిశీలన



## మద్యం దుకాణాలకు

# దసరా కిక్కు

పండుగ రోజు డ్రై డే

- ❖ ముందు రోజుల్లో భారీగా విక్రయాలు
- ❖ సెప్టెంబర్ 29న రూ.278 కోట్లు, 30న రూ.333 కోట్ల విలువైన మద్యం సేల్స్





హైదరాబాద్: దసరా పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఖజానాకు మద్యం అమ్మ కాలు భారీగా కిక్కునిచ్చాయి. పండుగకు ముందు వచ్చిన రెండు రోజుల సెలవులను సద్వినియోగం చేసుకున్న మందుబాబులు వైన్ షాపులపై దండయాత్ర చేశారు. ఈ క్రమంలో కేవలం రెండు రోజుల్లోనే (సెప్టెంబర్ 29, 30) ఏకంగా రూ.611 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. దసరా, గాంధీ జయంతి ఒకే రోజు (అక్టోబర్ 2) రావడంతో డ్రై డే కారణంగా ముందు రోజుల్లోనే రికార్డు స్థాయిలో అమ్మ కాలు జరిగాయని ఎక్సైజ్ శాఖ వెల్లడించింది.

– అక్షరదర్బార్, హైదరాబాద్

03



## గంగారం రాజకీయం

# గరం గరం

- జడ్పీ చైర్మన్ పీఠం జనరల్ రిజర్వ్‌డ్
- అన్ని ప్రధాన పార్టీల గురి ఈ స్థానంపేనే..
- ఓసీ వర్గానికి చెందిన నేతలు పోటీ చేసేందుకు ఉత్సాహం
- పొరుగు మండలానికి చెందిన నేతలకు అవకాశం ఇవ్వమని మండల నేతల హుకుం
- వారిని బుజ్జగించే, లాలించే పనిలో పార్టీ నేతలు



**మానుకోట జిల్లాలోని 18 జడ్పీటీసీ స్థానాల్లో ఈ మండలం మాత్రమే జనరల్**

మహబూబాబాద్ జిల్లాపరిషత్ చైర్మన్ పీఠం ఎవరికి దక్కుతుందనే చర్చ జిల్లాలో జోరుగా సాగుతున్నది. జిల్లాలో మొత్తం 18 జడ్పీటీసీ స్థానాల్లో కేవలం గంగారం మండలం (ములుగు నియోజకవర్గం) మాత్రమే జనరల్‌కు రిజర్వ్ అయింది. మిగతా మండలాలన్నీ ఎస్టీ, బీసీ, మహిళలకు రిజర్వ్ అయ్యాయి. గంగారం మండలం జడ్పీటీసీ స్థానం జనరల్ కావడంతో, జడ్పీ చైర్మన్ పదవి జనరల్ కావడంతో గంగారం నుంచి పోటీ చేసి, జడ్పీటీసీగా గెలిచేవారు దాదాపు జడ్పీ చైర్మన్ పీఠం దక్కించుకునే అవకాశం ఉంది. దీంతో రాజకీయ పార్టీలన్నీ ఈ స్థానాన్ని ఎలా కైవసం చేసుకోవాలనే ఉద్దేశంతో పావులు కదుపుతున్నాయి. ఎలాగైనా ఆ స్థానాన్ని దక్కించుకునేందుకు గెలుపు గుర్రాలను వెతుకుతున్నాయి. మరోవైపు ఓసీ సామాజికవర్గం నుంచి పోటీ చేయాలనుకునే వారు గంగారం మండలాన్నే టార్గెట్ చేశారు.

- అక్షరదర్బార్, మహబూబాబాద్

03

# కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ విధ్వంసం

- ❖ జీఎస్టీ వసూళ్లలో దేశంలోనే అట్టడుగు స్థాయి
- ❖ బీఆర్ ఎస్ పాలనలో నంబర్ వన్ స్థానం
- ❖ పాలన వైఫల్యం వల్లనే వ్యవసాయం నుంచి రియల్ ఎస్టేట్ రంగాలు కుదేలు
- ❖ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**అక్షరదర్బార్, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ సంపూర్ణ విధ్వంసానికి గురైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం ఓ ప్రకటనలో తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సెప్టెంబర్ 2025 నెలలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్ల వృద్ధి రేటులో తెలంగాణ దేశంలోనే అట్టడుగున ఉండటాన్ని ఆయన ఉటంకించారు. సరిగ్గా రెండేళ్ల క్రితం, బీఆర్ఎస్ పాలనలో జీఎస్టీ వృద్ధిలో రాష్ట్రం నంబర్ వన్ స్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. ప్రస్తుత పతనం కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ఆర్థికవ్యవస్థ విధ్వంసం పాలయ్యిందో చెప్పడానికి నిదర్శనమని ధ్వజమెత్తారు.



# అభ్యర్థుల వేటలో పార్టీలు

- భూపాలపల్లి జిల్లాలో జెడ్పీటీసీ అభ్యర్థుల వడబోత షురూ
- ఒక్కో మండలం నుంచి ముగ్గురి పేర్ల పరిశీలన

అక్షరదర్బార్, మొగుళ్లపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా భూపాలపల్లి నియోజకవర్గంలో జడ్పీటీసీ స్థానాల కోసం ప్రధాన రాజకీయ పార్టీలు గెలిచే అభ్యర్థుల కోసం వేట ప్రారంభించాయి, ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలను కైవసం చేసుకోవాలని వ్యూహాలు రచిస్తోంది. జడ్పీటీసీ స్థానాలకు ఖరారైన రిజర్వేషన్ల ఆధారంగా ప్రజల్లో పలుకుబడి కలిగిన నాయకుల కోసం అన్వేషిస్తోంది. ప్రతి జడ్పీటీసీ స్థానం నుంచి ముగ్గురు పేర్లతో జాబితాను ఆదివారం లోపు పంపించాలని అధికార పార్టీ అధిష్టానం ఆదేశించింది

ఈ నేపథ్యంలో జాబితా తయారీపై జిల్లా నాయకులు ఏకాభిప్రాయం కలిగి ఉండాలని కూడా ప్రత్యేకంగా సూచించింది. ఇప్పటికే సమన్వయ కమిటీలు సేకరించిన ఆశావహుల జాబితాను భూపాలపల్లి జిల్లా నాయకులు ఒక్కో స్థానానికి ముగ్గురు పేర్లతో కూడిన జాబితా పంపిస్తే అందులో నుండి ఒకరి పేరుతో పీసీసీ తుది జాబితా ఖరారు చేయనుంది.


## - ఒక్కో జడ్పీటీసీకి ముగ్గురి చొప్పున..

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 12 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. ఇందులో ఆరు మహిళలకు రిజర్వ్ అయ్యాయి. జడ్పీ పీఠం బీసీ జనరల్ కు రిజర్వు కాగా జిల్లాలోని పన్నెండు జడ్పీటీసీ స్థానాలకు ప్రతి స్థానం నుంచి ముగ్గురేసి ఆశావహుల పేర్లను డీసీసీ ఇప్పటికే సేకరించి ఉమ్మడి జిల్లా ఇంఛార్జి మంత్రికి పంపించినట్లు ప్రచారం జరుగుతోంది. భూపాలపల్లి నియోజకవర్గంలోని చిట్యాల జడ్పీటీసీ అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్ నుంచి గాజర్ల అశోక్ ఆశిస్తున్నట్లు తెలిసింది. అయితే జెడ్పీ చైర్మన్ రేసులో ఉన్న ఈయన పేరు ఏకగ్రీవంగా ప్రకటించేందుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. మొగుళ్లపల్లి మండలం నుంచి ముగ్గురు ఆశావహుల పేర్లను బుధవారం ఖరారు చేసినట్లు తెలిసింది. భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులను డీసీసీ ప్రతినిధులు సమన్వయం చేసుకొని ఆశావహుల పేర్లతో జాబితా రూపొందిస్తున్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని అధికార పార్టీ జడ్పీటీసీ స్థానాలకు పక్కాగా గెలిచే అభ్యర్థులకే అభ్యర్థిత్వం దక్కే అవకాశమున్నట్లు తెలుస్తుంది. జడ్పీ చైర్మన్ పదవి మాత్రం జిల్లాలోని భూపాలపల్లి, మంథని నియోజకవర్గిల్లో ఏ నియోజకవర్గానికి దక్కనుందనేది చర్చనీయాంశమైంది.



# గంగారం

## రాజకీయం గరంగరం




- మానుకోట జిల్లాలోని 18 జడ్పీటీసీ స్థానాల్లో ఈ మండలం మాత్రమే జనరల్
- జడ్పీ చైర్మన్ పీఠం జనరల్ రిజర్వ్‌డ్
- అన్ని ప్రధాన పార్టీల గురి ఈ స్థానంపేనే..
- ఓసీ వర్గానికి చెందిన నేతలు పోటీ చేసేందుకు ఉత్సాహం
- పొరుగు నేతలకు అవకాశం ఇవ్వమని మండల నేతల హుకుం
- వారిని బుజ్జగించే, లాలించే పనిలో పార్టీ నేతలు

**అక్షరదర్బార్, మహబూబాబాద్:**

మహబూబాబాద్ జిల్లాపరిషత్ చైర్మన్ పీఠం ఎవరికి దక్కుతుందనే చర్చ జిల్లాలో జోరుగా సాగుతున్నది. జిల్లాలో మొత్తం 18 జడ్పీటీసీ స్థానాల్లో కేవలం గంగారం మండలం (ములుగు నియోజకవర్గం) మాత్రమే జనరల్‌కు రిజర్వ్ అయింది. మిగతా మండలాలన్నీ ఎస్టీ, బీసీ, మహిళలకు రిజర్వ్ అయ్యాయి. గంగారం మండలం జడ్పీటీసీ స్థానం జనరల్ కావడంతో, జడ్పీ చైర్మన్ పదవి జనరల్ కావడంతో గంగారం నుంచి పోటీ చేసి, జడ్పీటీసీగా గెలిచేవారు దాదాపు జడ్పీ చైర్మన్ పీఠం దక్కించుకునే అవకాశం ఉంది. దీంతో రాజకీయ పార్టీలన్నీ ఈ స్థానాన్ని ఎలా కైవసం చేసుకోవాలనే ఉద్దేశంతో పావులు కదుపుతున్నాయి. ఎలాగైనా ఆ స్థానాన్ని దక్కించుకునేందుకు గెలుపు గుర్రాలను వెతుకుతున్నాయి. మరోవైపు ఓసీ సామాజికవర్గం నుంచి పోటీ చేయాలనుకునే వారు గంగారం మండలాన్నే టార్గెట్ చేశారు.

## - రెడ్డి సామాజిక వర్గం కన్ను..

గంగారం మండలం నుంచి పోటీ చేసేందుకు ఓసీ సామాజికవర్గాల నుంచి, ముఖ్యంగా రెడ్డి సామాజికవర్గం నుంచి పోటీ ఎక్కువగా కనిపిస్తున్నది. కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రధానంగా మూడు పేర్ల బలంగా వినిపిస్తున్నాయి. పార్టీ సీనియర్ నేత, ప్రస్తుత సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి తనయుడు భార్గవ్ రెడ్డి పేరు వినిపిస్తున్నది. భార్గవ్ రెడ్డికి పార్టీలో బలమైన మద్దతు ఉండటం సానుకూలమైన అంశం. అలాగే సీఎం కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా పేరున్న యువ నేత శ్రీకాంత్ రెడ్డి పేరూ ప్రముఖంగా వినిపిస్తోంది. ఈఇద్దరితో పాటు పార్టీ సీనియర్ రాజకీయ నాయకుడు నూకల నరేశ్‌రెడ్డి కుమారుడు అభినవ రెడ్డి పేరు కూడా వినిపిస్తున్నది. పీఠం జనరల్ కావడంతో మంచి అవకాశంగా భావిస్తూ, రాజకీయంగా సరైన సమయాన్ని ఆలోచించి ఈ ముగ్గురు నేతలు ఈ జడ్పీ చైర్మన్ రేసులోకి దిగినట్టు సమాచారం. వీరిలో ఇద్దరు నేతలు ఇప్పటికే అధిష్టానం పెద్దలతో టచ్‌లో ఉన్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

## - బుజ్జగింపులు.. పైరవీలు

గంగారం మండలం నుంచి తమ పార్టీ అభ్యర్థులను పోటీలోకి దించి జడ్పీ చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేందుకు మూడు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ గట్టిగా ప్రయత్నాలు ప్రారంభించాయి. మరోవైపు ధనబలం, రాజకీయ బలం ఉండి గంగారం మండలానికి వెలుపల ఉన్న ఇతర మండలానికి చెందిన నేతలు ఇదే మండలం నుంచి పోటీ చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ, అసలు.. గంగారం మండలానికి చెందిన అన్ని ప్రధాన పార్టీలకు చెందిన నేతలు మాత్రం, తాము బయటి వారు ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వలేమని తెగేసి చెప్తున్నారు. పార్టీల కోసం దశాబ్దాలుగా పనిచేస్తున్నామని, జడ్పీ చైర్మన్ పీఠం దక్కించుకునే అవకాశాన్ని వదులుకునే సమస్యే లేదని వెల్లడిస్తున్నారు. దీంతో ఇతర మండలాలకు చెందిన ఆశావహులు వారిని బుజ్జగించే పనిలో పడ్డారు. కొందరు ఆశావహులైతే ఆయా పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

## - జడ్పీటీసీ రిజర్వేషన్లు ఇలా..

జిల్లాలో మొత్తం 18 జడ్పీటీసీ స్థానాలకు కేటాయింపులను పూర్తిచేస్తూ గెజిట్–8 అనుబంధాన్ని విడుదల చేశారు. తాజా కేటాయింపుల ప్రకారం, షెడ్యూల్డ్ తెగలకు (ఎస్టీ) అత్యధికంగా 6 స్థానాలు దక్కాయి. వీటిలో డోర్నకల్ (ఎస్టీ), ఇనుగుర్తి (ఎస్టీ – మహిళ), కేసముద్రం (ఎస్టీ – మహిళ), కురవి (ఎస్టీ – మహిళ), నర్సింహులపేట (ఎస్టీ – పురుషులు/మహిళలు), సీరోలు (ఎస్టీ – పురుషులు/మహిళలు) ఉన్నాయి. వెనుకబడిన తరగతులకు (బీసీ) 7 స్థానాలు కేటాయించగా, బయ్యారం (బీసీ – మహిళ), గూడూరు (బీసీ – పురుషులు/మహిళలు), కొత్తగూడ (బీసీ – పురుషులు/మహిళలు), మహబూబాబాద్ (బీసీ – పురుషులు/మహిళలు), మరిపెడ (బీసీ – మహిళ), నెల్లికుదురు (బీసీ – పురుషులు/మహిళలు), తొర్రూరు (బీసీ – మహిళ) ఉన్నాయి. షెడ్యూల్డ్ కులాలకు (ఎస్సీ) దంతాలపల్లి (ఎస్సీ – మహిళ), పెదవంగర (ఎస్సీ – పురుషులు/మహిళలు) స్థానాలు రిజర్వు కాగా, జనరల్ (అన్ రిజర్వ్‌డ్) కోటాలో గంగారం ( పురుషులు/మహిళలు), గార్ల ( మహిళ) స్థానాలు ఖరారయ్యాయి. ఈ కేటాయింపులతో స్థానిక రాజకీయ వర్గాల్లో వేడి రాజుకుంది.

## వలసవాదులకు అవకాశం ఇవ్వం..

**- జాడి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ గంగారం మండల అధ్యక్షుడు**

తెలంగాణ వచ్చిన తర్వాత బీఆర్ఎస్ పదేళ్లు పాలించింది. మానుకోట జిల్లాలోని మిగతా అన్ని మండలాల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకున్నది. కానీ, గంగారం మండలానికి చెందిన కాంగ్రెస్ నేతలు ఏ ఒక్క సీటునూ బీఆర్ఎస్ దక్కకుండా పనిచేశారు. కాంగ్రెస్ పార్టీ జెండాని గంగారం గడ్డపై రెపరెపలాడించారు. అలాంటి గడ్డపై వలసవాదులకు అవకాశం ఇవ్వం. మండలానికి చెందిన నేతలే జడ్పీటీసీ ఎన్నికల బరిలో ఉంటారు.



# మద్యం దుకాణాలకు దసరా కిక్కు

- పండుగ రోజు డ్రై డే
- ముందు రోజుల్లో భారీగా విక్రయాలు
- సెప్టెంబర్ 29న రూ.278 కోట్లు, 30న రూ.333 కోట్ల విలువైన మద్యం సేల్స్

అక్షరదర్బార్, హైదరాబాద్: దసరా మందు బాబులకు ఫుల్లు కిక్కు అందించింది. రాష్ట్ర ఖజానాకు పండుగ తెచ్చింది. రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు జరిగాయి. రెండు రోజుల్లోనే దాదాపు రూ 420 కోట్ల మేర మద్యం అమ్మకాలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. సాధారణ రోజుల అమ్మకాలతో పోల్చితే ఇవి చాలా రెట్లు అధికంగా ఉన్నాయి. ఈ సారి దసరా అక్టోబర్ 2న రావటంతో మద్యం అమ్మకాలు ఆ రోజున లేకపోవటంతో ఎక్సైజ్ అధికారులు ఆలోచనలో పడ్డారు. మందుబాబులు మాత్రం ఖజానా కు పండుగ ఆదాయం భారీగా తెచ్చారు. సెప్టెంబరు 29న రూ.278 కోట్లు, 30న రూ.333 కోట్లు, అక్టోబర్ 1న రూ.86.23 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈ 3 రోజుల్లోనే 60 నుంచి 80శాతం వరకు అమ్మకాలు పెరిగాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు.. రాష్ట్ర వ్యాప్తంగా 29.92 లక్షల కేసుల లిక్కర్, 36.46 లక్షల కేసుల బీర్లు విక్రయించారు. గతేడాదితో పోలిస్తే 7శాతానికి పైగా మద్యం విక్రయాలు పెరిగాయి. మద్యం సేల్స్ పెరగడంతో ఎక్సైజ్ శాఖకు రాబడి పెరిగింది. దసరా, అక్టోబర్ 2(గాంధీ జయంతి) ఒకేరోజు రావడంతో.. అంతకు ముందు రోజు భారీగా మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు స్పష్టం చేశారు. దసరా, అక్టోబర్ 2(గాంధీ జయంతి) ఒకేరోజు రావడంతో.. ముందు రోజు భారీగా మద్యం విక్రయాలు జరిగాయని ఎక్సైజ్ శాఖ వెల్లడించింది. ప్రతీ ఏటా దసరా వేళ ఎక్సైజ్ శాఖ కు లిక్కర్ అమ్మకాలతో భారీగా ఆదాయం సమ కూరుతోంది. ఈ సారి అంతకు మించి రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిగాయి. అటు మద్యం దుకాణాలకు టెండర్లు ఆహ్వానించటంతో... ఎక్సైజ్ శాఖ ప్రస్తుతం కొత్త దుకాణాల ఖరారు పైన ప్రత్యేకంగా ఫోకస్ చేసింది.

# తాళ్లపూసపల్లి ఎంపీటీసీ బరిలో బానోత్ శారద

అక్షర దర్బార్, కేసముద్రం: కేసముద్రం మండలం తాళ్లపూస పల్లి ఎంపీటీసీ బరిలో బానోత్ శారద ఉండనున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాళ్లపూస పల్లి ఎంపీటీసీ స్థానం ఎస్టీ మహిళగా రిజర్వ్ డ్ అయిన నేపథ్యంలో ఆమెకు అవకాశం ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీని కోరారు. ఎస్టీ మహిళగా రిజర్వేషన్ రావడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేస్తూ ఈ ఒక్కసారి తనకు అవకాశం ఇవ్వాలని వేడుకున్నారు. తనను ప్రజలు ఆశీర్వదిస్తే ముమ్ముందు ఎన్నో సేవలు చేయడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తన అభ్యర్థనను పరిగ ణలోకి తీసుకుంటుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.



# సమస్త మానవాళికి మార్గదర్శి బాపూజీ

**గాంధీజీ కలలను నిజం చేయడమే ఘన నివాళి : బుచ్చిరెడ్డి**

అక్షర దర్బార్, శాయంపేట: మహాత్మా గాంధీ ఎంచుకున్న మార్గం సమస్త మానవాళికి ఆచరణీయమని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి పేర్కొన్నారు. అక్టోబర్ 2న గాంధీజీ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీజీ ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల ద్వారా స్వాతంత్య్ర పోరాటానికి ప్రేరణని చ్చారని తెలిపారు. సామరస్యం, సమానత్వం, న్యాయం కోసం ఆయన జీవితం అంకితం చేశారని, గాంధీజీ కలలను నిజం చేయడమే ఆయనకు ఘనమైన నివాళి అవుతుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మారపల్లి రవీందర్, చిందం రవి, వైనాల కుమారస్వామి, దుబాసి కృష్ణమూర్తి తదిత రులు పాల్గొన్నారు.



# శాయంపేట జెడ్పీటీసీ బరిలో యువనేత లాడే శివ

**గెలిచే ధీమాతో బీజేపీకి బలమైన ఆశ**

అక్షర దర్బార్, శాయంపేట: హను మకొండ జిల్లా శాయంపేట మండల జెడ్పీటీసీ స్థానానికి ఈసారి యువనేత, విద్యావేత్తగా గుర్తింపు పొందిన లాడే శివ బరిలో దిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. బీజేపీ జిల్లా నాయకుడిగా గత ఎని మిదేళ్లుగా పార్టీకి అంకిత భావంతో పనిచేస్తూ, విశ్వసనీయతను సంపా దించుకున్న శివకు పార్టీ నుంచి అవకాశం వస్తే గెలిచే అవకాశం ఖాయమని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మండలంలో పరిచయం అవసరం లేని నేతగా ప్రజల్లోకి వెళ్లిన లాడే శివ ప్రత్యేకంగా యువతలో విపరీతమైన క్రేజ్ సాధించు కున్నారు. ఆయనకు సొంతంగా ఉన్న బలమైన బీసీ సామాజిక వర్గ మద్దతు, అలాగే ఆరె కులస్తుల ఓట్లు అధికంగా ఉండటం, ఆయన గెలుపు అవకాశాలను మరింత బలపరుస్తున్నట్లు విశ్లేష కులు అభిప్రాయపడుతున్నారు. "నిజాయితీగా పనిచేసే నాయ కుడిగా ప్రజల్లో గుర్తింపు తెచ్చుకున్నాను. పార్టీ నాకు అవకాశం ఇస్తే, ప్రజల ఆశీర్వాదంతో తప్పకుండా గెలవగ లను" అని ధీమాగా చెబుతున్నారు. ఈ సారి శాయంపేట జెడ్పీటీసీ ఎన్నికల్లో లాడే శివ కీలక అభ్యర్థిగా మారనున్నట్లు మండల వ్యాప్తగా చర్చ జరుగుతోంది.



# శ్రీ భవానీ మాత శోభాయాత్ర

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలో శుక్రవారం రోజున దుర్గాదేవి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శోభాయాత్ర నిర్వహించారు. పరకాల పట్టణంలోని ప్రముఖ శైవ క్షేత్రం శ్రీకుంకుమేశ్వర దేవస్థానం పూజారి కోమాళ్ళపల్లి నాగభూషణశర్మ వేదపండితులు సంపత్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో నవరాత్రులు ఘనంగా నిర్వహించారు. 11 రోజులుగా అమ్మవారు విశేష పూజలు అందుకున్నారు. శోభాయాత్రలో భవాని దీక్షా దారులు, ఆలయ చైర్మన్ రాజేశ్వరరావు కమిటీ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.











# చెడుపై విజయానికి ప్రతీక దసరా

**- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

అక్షరదర్బార్, వరంగల్: చెడుపై మంచి సాధించిన విజ యానికి ప్రతీకగా ప్రతి ఏటా దసరా పండుగను జరుపు కుంటామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. వరంగల్ 14వ డివిజన్ చిన్నవడ్డేపల్లి చెరువు సమీపంలో గురువారం తొలిసారి ఏర్పాటు చేసిన రావణ వధ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మన సంస్కృతిని పరిరక్షించుకో వాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అన్నారు. ఈసం దర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, బాణాసంచా (క్రాకర్స్ షో) ప్రజలను ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్సవాల్లో భాగంగా 35ఫీట్ల ఎత్తుతో ఏర్పాటు చేసిన రావణాసురుని ప్రతిమను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎంపీ పసునూరి దయాకర్, మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, నన్నపునేని నరేందర్, స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, స్థానిక నాయకులు ముడుసు నర్సింహా, కేతిరి రాజశే ఖర్, ఇంతియాజ్, స్టాలిన్, చంద్రశేఖర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఏవీవీ మైదానంలో విజయదశమి వేడుకలు

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ మట్టెవాడలోని ఏవీవీ కాలేజీ మైదానంలో ఏవివి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం దసరా పండుగ(విజయద శమి)ను పురస్కరించుకుని అసోసియేషన్ అధ్యక్షులు మామిడాల సుధాకర్ దంపతుల ఆధ్వర్యంలో జమ్మి పూజా కార్యక్రమాన్ని అయ్యగారు హరిప్రసాద్ చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు. జమ్మి చెట్టుకు మామిడి తోరణంలతో బంతిపూల దండలతో పట్టు కండువతో చెట్టు చుట్టూ ముగ్గులతో ముచ్చటగా అలం కరించి ముందుగా గణపతి పూజ అనంతరం జమ్మి చెట్టు యొక్క ప్రాధాన్యత దాని యొక్క విశిష్టత హరిప్ర సాద్ అయ్యగారు అందరికీ అర్థమయ్యే విధంగా వివ రించారు. ఈకార్యక్రమంలో ఏవీవీ జూనియర్ కళాశాల సెక్రటరీ డాక్టర్ చందా విజయ్‌కుమార్ దంపతులు, మనోహర్‌బాబు, ఎం.హరిబాబు, ధనుంజయ ప్రసాద్, శ్రీనివాస్, కుసుమ వెంకటస్వామి, రవ్వ శ్రీను తదిత రులు పాల్గొన్నారు.

## శాయంపేటలో వేడుకగా దసరా ఉత్సవాలు

అక్షర దర్బార్, నల్లబెల్లి : నల్లబెల్లి మండల కేంద్రంలో దసరా ఉత్సవాలు శాంతియుతంగా జరిగాయి. నల్లబెల్లి గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నాగవెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామంలో రావణ వధ నిర్వహించారు. వేడుకల్లో హింసాత్మక ఘటనలు జరగకుండా ఎస్సై గోవర్ధన్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది చర్యలు తీసుకు న్నారు.

# 'నడికూడలో' రసవత్తర పోరు

- బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ హోరాహోరీ
- మండలంలో రోజురోజుకీ హీటెక్కుతున్న రాజకీయాలు
- వ్యూహ ప్రతివ్యూహాలతో రక్తికడుతున్న ఎన్నికలు



అక్షర దర్బార్, పరకాల: హనుమకొండ జిల్లా నడికూడ మండల జెడ్పీటీసీ ఎన్నికలు ఈసారి హోరాహోరీగా జర గనున్నాయి. స్థానిక సంస్థల రెండో విడత ఎన్నికల్లో భాగంగా ఈనెల 13న నోటిఫికేషన్ వెలువడనుండగా, రాజకీయ వాతావరణం మండల వ్యాప్తంగా వేడెక్కు తోంది. అభ్యర్థుల బలం, వర్గీయ సమీకరణాలు, పార్టీల వ్యూహాలు — ఇవన్నీ కలిసి నడికూడ జడ్పీటీసీ పోరును రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం చేస్తోంది.

## కాంగ్రెస్ తరపున పర్నం మల్లారెడ్డి ?

నడికూడ జెడ్పీటీసీ స్థానం కోసం కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీటీసీగా సేవలందించిన పర్నం మల్లారెడ్డికు టికెట్ దాదాపు ఖరారైనట్లు సమాచారం. గతంలో స్థానిక సంస్థల్లో సేవలు అందించిన అనుభవం, మండలంలోని గ్రామాలపై ఉన్న పట్టుతో ఆయన బరిలో బలమైన పోటీ దారుగా భావిస్తున్నారు. పార్టీతో నిత్యం సన్నిహిత సంబంధాలు, మండల స్థాయి శ్రేణుల మద్దతు, అలాగే ఇటీవల కాంగ్రెస్ పెరుగుతున్న ప్రాచుర్యం — ఇవన్నీ ఆయన గెలుపుకు తోడ్పడతాయని కాంగ్రెస్ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## బీఆర్ఎస్ లో ఆశావహుల రద్దీ

ఇక బీఆర్ఎస్ వైపు నుంచి టికెట్ కోసం పోటీ పడుతున్న వారిలో మాజీ వైస్ ఎంపీపీ చంద కుమార స్వామి (వరికోల్), నందికొండ జైపాల్ రెడ్డి, నందికొండ గణపతి రెడ్డి (చర్లపల్లి), మాజీ సర్పంచ్ ఊర రవీందర్రావు, అలాగే దూరిశెట్టి చంద్రమౌళి (నడి కూడ) పేర్లు వినిపిస్తున్నాయి. అభ్యర్థి ఎంపికపై ఇంకా స్పష్టత లేకపోయినా, బీఆర్ఎస్ కీలక నేతలు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, రైతు రుణ విమోచన మాజీ చైర్మన్ నాగుర్ల వెంక టేశ్వర్లు తమ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం వ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది.

## వర్గీయ సమీకరణాలు కీలకం

నడికూడలో వర్గీయ సమీకరణాలు ఎప్పటిలాగే కీలకంగా నిలవనున్నాయి. అభ్యర్థుల ఎంపికలో కుల ఆధారిత సమీకరణాలు కీలకపాత్ర పోషించనున్నాయి. ఎవరు బలమైన వర్గ మద్దతు సాధిస్తారనే అంశం గెలుపు ఓటములను ప్రభావితం చేయనుంది. ఓటర్లు అభ్యర్థుల గత పాలన, వ్యక్తిగత సేవా కార్యక్రమాలు, ఆర్థిక స్థితి, సామాజిక ప్రభావం వంటి అంశాలను పరి గణలోకి తీసుకుంటున్నారు. అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారం, వ్యక్తిగత సంబంధాలు కూడా ఓటర్ల నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించనున్నాయి. నడికూడ జెడ్పీటీసీ స్థానం కేవలం స్థానికంగా కాకుండా రాష్ట్రవ్యాప్తంగా కూడా చర్చనీయాంశంగా మారనుంది. బీఆర్ఎస్ – కాంగ్రెస్ నేరుగా తలపడుతున్న ఈ పోరు, రాష్ట్ర రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకుల అభిప్రాయం.